సూర్య సకల
features@suryaa.com
మంగళవారం 3 సెప్టెంబర్ 2013

అయ్యవారికి దన్నంపెట్టు... అమ్మగారికి దన్నంపెట్టు

సుమధుర సుభాషిణి

- ప్రదర్శనలతో ఎన్నో అవార్డులు
- గాయత్రి అకాడమీ ద్వారా శిక్షణ
- వీణాపరిణయం ఆంగ్లంలోకి తర్జుమా

చిరుప్రాయంలోనే సంగీతంపై మక్కువతో ఆమె ఆ రంగంలోకి అడుగుపెట్టారు. పలువురు ప్రముఖుల వద్ద శిష్యరికం చేసి వీణా వాయిద్యంలో ఆరి తేరారు. ఎంతోమంది శిష్యులకు ప్రస్తుతం గురువుగా మారారు. మన రాష్ట్రంతోపాటు ఇతర రాషాట్రల్లోనూ పలు ప్రదర్శనలు ఇచ్చి మన్ననలు అందుకున్నారు. ఆమే సుభాషిణీ శాస్త్రి. మల్కాజ్‌గిరిలోని సఫిల్‌గూడలో గాయత్రి అకాడమీని ఏర్పాటు చేసి ఔత్సాహికులకు వీణా వాయిద్యంలో శిక్షణ ఇస్తూ రాణిస్తున్నారు. భర్త సహకారంతో ఈ కళను మరింత విస్తరిస్తున్నారు. ఆ వివరాలు నేటి 'సకళ'లో మీ కోసం...

వింటూ

ఏ కళలో అయినా రాణించాలంటే ఎంతో సాధన అవసరం. అందరికీ తొందరగా విద్య రాదు. ఎంతో శ్రమించాలి. అప్పుడే ఆ కళలో రాణిస్తాం. పేరు తెచ్చుకుంటాం. తొమ్మిదేళ్ల వయసులో విశాఖకు చెందిన వాసా కృష్ణమూర్తి వద్ద శిష్యరికం చేసిన ఆమె అప్పుడు మంచి శిష్యురాలు. ప్రస్తుతం ఆమె మంచి గురువు. గొప్ప కళాకారిణిగా పేరుపొందారు. దక్షిణాది రాష్ట్రాలతో పాటు ఉత్తరాదిన కూడా పలు కచేరీలు ఇచ్చి సంగీత విద్వాంసుల ప్రశంసలను సుభాషిణీ శాస్త్రి అందుకున్నారు. హైదరాబాద్ మల్కాజ్‌గిరి నియోజకవర్గ పరిధిలోని సఫిల్‌గూడలో నివాసం ఉంటున్న సుభాషిణీ శాస్త్రి ప్రకాశం జిల్లా కందుకూరులో రాజేశ్వరి, కె.ఆర్ నరసింహం దంపతులకు 1958 మే 3వ తేదీన జన్మించారు. వీరి బామ్మ, అమ్మమ్మలు కూడా గాయకులు కావడంతో అవి చిన్నతనం నుంచే సంగీతంపై ఎంతో మక్కువ పెంచుకున్నారు. తొమ్మిది సంవత్సరాల వయసులో వాసా కృష్ణమూర్తి వద్ద శిష్యరికం చేసిన ఆమె తరువాత మంచాల జనార్థన్ వద్ద హైదరాబాద్‌లో, ప్రముఖ వీణా విద్వాన్ శంకరశాస్త్రి వద్ద వీణావాయిద్యంలో శిక్షణ తీసుకున్నారు. 1975లో తొలిసారిగా ప్రదర్శనలను ఇవ్వడం ప్రారంభించిన సుభాషిణీ శాస్త్రి ఇప్పటివరకు వెనుతిరిగి చూసుకోనవసరం లేకుండా వందలాది ప్రదర్శనలను కొనసాగిస్తున్నారు. 1979లో వివాహం చేసుకున్న ఆమె భర్త సి.ఎస్ శాస్త్రి సహకారంతో ఈ రంగంలో రాణిస్తున్నారు. సి.ఎస్ శాస్త్రి హైదరాబాద్‌లోనే పవర్‌మాక్ సంస్థలో మేనేజర్‌గా విధులను నిర్వహిస్తున్నారు. బికాం, బిఎ మ్యూజిక్‌లో పట్టభద్రురాలైన సుభాషిణీ శాస్త్రి ముదిగొండ వీరభద్రయ్య రాసిన 'వీణా పరిణయం' పుస్తకాన్ని ఆంగ్లంలోకి తర్జుమా చేశారు. 2012 వరకు తెలుగు విశ్వవిద్యాలయంలో వీణ శిక్షణలో బోధకురాలిగా పనిచేసి ఎంతోమందిని తీర్చిదిద్దారు. తరువాత స్వచ్ఛందంగా గాయత్రి అకాడమీని ఏర్పాటు చేసి పలువురు ఔత్సాహికులకు వీణా వాయిద్యంలో శిక్షణ ఇస్తున్నారు. స్వతహాగా ఆమె చెల్లెలు కూడా గాయకురాలు కావడం విశేషం. సుభాషిణి శాస్త్రి కుమారుడు ఓ ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నారు.

నేర్చుకున్న విద్యను నేర్పుతున్నా

సుభాషిణీ శాస్త్రి

నేను నేర్చుకున్న విద్యను నలుగురికీ నేర్పిస్తున్నా. ఇప్పటివరకు వందమందికి పైగా గాయత్రి అకాడమీలో శిక్షణ పొందారు. చిన్నతనం నుంచి సంగీతం అంటే ఇష్టం కావడంతో అకాడమీని ఏర్పాటు చేసి ఈ కళను విస్తృతం చేస్తున్నా. భవిష్యత్తులో మరింతమందికి ఈ శిక్షణను ఇలాగే కొనసాగిస్తా. పేద విద్యార్థులకు కూడా చేయూత అందిస్తా.

అవార్డులు

- 1983లో లక్నో తెలుగు అసోసియేషన్, 1986లో బిలాయ్, 1989లో చెన్నై, 1994లో కాలికట్, తిరువాయూరులో ప్రదర్శన ఇచ్చారు.
- 2006లో ఢిల్లీలోని ఎ.పి బవన్లో, 2012లో తిరుమల నాద నీరాజనంలో ప్రదర్శన ఇచ్చి ప్రతిభ చూపారు.
- 1986లో విశాఖ జిల్లా సాంస్కృతిక మండలి వారు మధుర వీణా భాషిణి బిరుదుతో ఆమెను సత్కరించారు. అదే ఏడాది విశాఖ సహృదయ సాహితి సంస్థ వారు మధుర మహతి బిరుదును ప్రదానం చేశారు.
- 1990లో జైసి ఆఫ్ ఎపి స్టేట్ సంస్థ నుంచి బెస్ట్‌స్టాండింగ్ యంగ్ ఇండియన్ అవార్డును అందుకున్నారు.
- తిరుమల, తిరుపతి దేవస్థానంతోపాటు భక్తి టెలివిజన్ ఛానల్, దూరదర్శన్, దూరవాణిలలో పలు కార్యక్రమాలను, రాజ్‌భవన్‌లో నిర్వహించిన ప్రదర్శనకుగాను అప్పటి రాష్ట్రపతి కె.ఆర్ నారాయణన్ చేతులమీదుగా పురస్కారం పొందారు.
- 2007లో మైసూరులోని గణపతి సచ్చిదానంద దత్తపీఠం వారు కూడా ఆమెకు సన్మానం చేశారు.

కాలిఫోర్నియాలో గిడుగు జయంతి

గిడుగు రామ్మూర్తి పంతులు 150వ జయంతి ఉత్సవం అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం సన్నీవేల్ నగరంలో ఘనంగా నిర్వహించారు. సిలికానాంధ్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలుగు భాషాభిమానులు హాజరయ్యారు. సిలికానాంధ్ర వైస్ ఛైర్మన్ మాడభూషి విజయసారధి గిడుగు రామ్మూర్తి పంతులు చిత్ర పటానికి పూలమాల వేసి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిలికానాంధ్ర ఉపాధ్యక్షుడు కొండిపర్తి దిలీప్ మాట్లాడుతూ వ్యావహారిక భాషకు గిడుగు ఆద్యుడని అన్నారు. గ్రాంధికం, శిష్ట వ్యావహారికం, వ్యావహారికం, మాండలీకాల మధ్య ఉన్న తారతమ్యాలను విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు నరసింహాచార్యులు వివరించారు. పిల్లలమర్రి కృష్ణకుమార్ మాట్లాడుతూ తెలుగు భాషోద్యమం నన్నయకాలం నుంచి ప్రారంభమై పోతన, పరవస్తు చిన్నయసూరి కాలాల్లో తగిన మార్పులు చెంది ప్రస్తుత భాషగా మారిందని తెలిపారు. సిలికానాంధ్ర ఛైర్మన్ కూచిభొట్ల ఆనంద్ మాట్లాడుతూ తెలుగు భాష సామాన్య జనులకు సైతం మరింత చేరువ అయ్యేందుకు గిడుగు రామ్మూర్తిలాంటి వారు చేసిన కృషి ఫలితమేనని అన్నారు. నేటి సాంకేతికత నైపుణ్యంతో తెలుగు భాషను ఆధునీకరిస్తున్న సిలికానాంధ్ర కృషి కూడా ఒక ఉద్యమంలాంటిదేనని అన్నారు.

అంతర్జాలంలో ఘంటసాల

సుమధుర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు మధుర గీతాలంటే అందరూ ఇష్టపడతారు. ఆరోజుల్లో ఎన్నో పాటలకు తన గాత్రాన్ని అందించి సంగీతప్రియుల హృదయాల్లో ఇప్పటికీ చెరగని ముద్ర వేసుకున్న అలనాటి గాయకుడు మధురస్మృతులు అందరూ తెలుసుకునేలా ఓ వెబ్‌సైట్ తాజాగా అందుబాటులోకి వచ్చింది. ఠీఠీఠీ.జఙ్ఞ్టట్చజ్ఞుఠుంటజీఛి.ఛీౌఝు పేరుతో రూపొందించిన ఈ వెబ్‌సైట్‌ను పద్మభూషన్ డాక్టర్ కె.ఐ వరప్రసాదరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఘంటసాల వెంకటేశ్వరరావు ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గాయకుడు టి. శరత్‌చంద్ర సమర్పణలో ఘంటసాల 'హృద్య పద్య గీతామృతం' నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాదరెడ్డి మాట్లాడుతూ పద్యం భాషకు మూలం అని అన్నారు. భాషపై మమకారం పెంచుకుంటే పద్యం, హృద్యం, జలపాతం, నవనీతం, పారిజాతంలా వికసిస్తుందని తెలిపారు. అనంతరం గాయకుడు టి. శరత్‌చంద్ర మాట్లాడుతూ ఔత్సాహికులు ఎవరైనా పద్యం రాసుకువస్తే దానిని ఉచితంగా స్వరపరచి ప్రాచుర్యం కల్పిస్తామని అన్నారు.